క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో పవనపుత్రుడు


కూరగాయలతో ఆంజనేయస్వామిని అలంకరించిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని ఆంజనేయస్వామికి బుధవారం అమావాస్య సందర్భంగా కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సురేష్‌బాబు

పాములపాడు: స్థానిక కేజీ రోడ్డుపై బుధవారం ఎస్ఐ సురేష్‌బాబు వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలను పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ద్విచక్రవాహన దారులు హెల్మెట్ తప్పకుండా వాడాలన్నారు. ఇన్సూరెన్స్ చేయించుకుంటే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందుతుందన్నారు.

కార్మికులకు సబ్బు, నూనెల పంపిణీ


సబ్బులు, నూనె అందజేస్తున్న సర్పంచ్

వెలుగోడు: మండల కేంద్రంలోని పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు సర్పంచ్ వేల్పుల జయపాల్ బుధవారం వేతనాలతోపాటు సబ్బులు, నూనెను అందజేశారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఆయన కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓ నరేంద్ర, జూనియర్ అసిస్టెంట్లు నవీన్ రెడ్డి, కావ్య రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాంక్ మేనేజర్ వితరణ


విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఇండియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కస్తూరి కృష్ణమోహన్

పగిద్యాల: మండలంలోని ఎన్. ఘణపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇండియన్ పడమర ప్రాతకోట బ్రాంచ్ మేనేజర్ రుగ్మాంద స్టడీ మెటీరియల్ కోసం ఆర్థిక సాయం అందజేశారు. రూ. 25 వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ కిట్లను బుధవారం ఇండియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కస్తూరి కృష్ణమోహన్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముర్తుజావళి, టీచర్ జగదీష్, అసిస్టెంట్ మేనేజర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

విశేష పూజలు


జ్వాలా విరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామి వారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్

బండి ఆత్మకూరు: వృద్ధులకు, మంచానికి పరిమితమైన రేషన్ కార్డు దారులకు ఇంటి వద్దకు రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ పద్మావతి బుధవారం తెలిపారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, వైకల్యం ఉన్న రేషన్ కార్డు దారులకు జూలై నెలకు సంబంధించిన రేషన్‌ను నేటి నుండి 30వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎంలో భూములు ఉన్న రైతులు సబ్ డివిజన్ కోసం రూ.50 చెల్లించి ఈనెల 30లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

షాదీఖానా.. సమస్యల బందీఖానా!

- కనీస సౌకర్యాలు కరువు
- పరిసరాల చుట్టూ దుర్గంధం
- పదవులపైనే మోజు..
- పట్టించుకోని పాలకులు


శిథిలావస్థకు చేరిన వెలుగోడు షాదీఖానా

వెలుగోడు: మైనార్టీల సౌకర్యార్థం వెలుగోడు పట్టణ కేంద్రంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన షాదీఖానా శిథిలావస్థకు చేరింది. మూడు దశాబ్దాలుగా పాలకులు వస్తున్నారు.. పోతున్నారు తప్ప.. షాదీఖానాను బాగు చేద్దామనే ఆలోచన చేయకపోవడం శోచనీయం. ఎన్నికల సమయంలో మైనారిటీలకు అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెప్పడమే తప్ప చేసింది లేదు. కనీసం నీరు, ఫ్యాన్లు, లైట్లు, టాయిలెట్స్, వాష్ రూమ్, చుట్టుపక్కల పరిశుభ్రత తదితర వసతులు కరువయ్యాయి. శుభకార్యాలకు వంట చేసుకోవాలంటే ప్రత్యేక గది లేక ఆరుబయట చేసుకోవాల్సి వస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వాళ్లకు సంబంధించిన పెళ్లిళ్లు, పేరంటాలకు షాది ఖానాను ఉపయోగించుకుంటారు. ఇతరుల నుంచి మాత్రం మెయింటెనెన్స్ చార్జెస్ పేరుతో డబ్బు వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. మైనార్టీల కోసం ప్రభుత్వం ఈ షాదీఖానా నిర్మిస్తే ఉచితంగా ఉపయోగించాల్సింది పోయి.. ప్రజల వద్ద వసూలు చేసి సొమ్ము చేసుకోవడం సరైంది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ నేతలే కమిటీ సభ్యులు

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే ..ఆ పార్టీ నేతలే షాదీఖానా కమిటీ సభ్యులుగా ఎన్నుకుంటారు. వారు చెప్పిందే వేదం అన్నట్లు షాదీఖానా నిర్వహణ ఉంటుంది. కమిటీ సభ్యులకు పదవులు, పెత్తనంపై ఉన్న మోజు, అభివృద్ధి చేయాలనే ఆలోచన ఏకోశానా లేదు. అందుకే షాదీఖానాకు ఈ దుస్థితి పట్టింది. శుభకార్యాల సమయంలో భోజనాలు చేసిన విస్తర్లు, వ్యర్థాలు పక్కనే పడేయడం, వాటిని శుభ్రం చేయకపోవడంతో పందులు, కుక్కలు పరిసర ప్రాంతాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మైనారిటీ షాది ఖానా అభివద్ధిపై దృష్టి సారించి కనీస వసతులు ఏర్పాటు చేయాలని ముస్లిం మైనారిటీలు కోరుతున్నారు.


షాదీఖానా చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

కేసుల పరిష్కారానికి కృషి చేయండి


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్, జూనియర్ జడ్జిలు

నందికొట్కూరు: రాజీ కాదగిన కేసులను గుర్తించి జూలై 5న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకునే దిశగా కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, చైర్మన్ శోభరాణి, ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ సూచించారు. బుధవారం కోర్టు చాంబర్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు పలు సూచనలు చేశారు. సదస్సులో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలి


స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నందికొట్కూరు: అనుమతులు లేకుండా నడుపుతున్న నారాయణ స్కూల్‌ను సీజ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు నాగరాజు, కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అక్షరశ్రీ పేరుతో నడుపుతున్న నారాయణ స్కూల్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ స్కూల్ అంటూ తల్లిదండ్రులకు మోసపూరిత మాటలు చెప్పి విద్యార్థులను చేర్చుకుంటున్నారన్నారు. తీరా టీసీలు, రికార్డులు అన్నీ కూడా అక్షర శ్రీ స్కూల్ పేరుతోనే ఇస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలను సీజ్ చేయాలని, లేనియెడలా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు మహేంద్ర, హరి, సుశాంత్, సంతోష్ ఉన్నారు.

నేటి నుంచి నట్టల నివారణ కార్యక్రమం

బండి ఆత్మకూరు: నేటి నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు మండలం వ్యాప్తంగా సామూహిక మేకల, గొర్రెల నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి అనూష తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రోజుకు రెండు గ్రామాల చొప్పున ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం బండి ఆత్మకూరు, పార్నపల్లి, 27న ఎర్రగుంట్ల ఈర్నపాడు, 28న సంతజూటూరు, సింగవరం, 30న పెద్దదేవలాపురం, కడమల కాలువ గ్రామాల్లో నిర్వహించనున్నారు. అలాగే వచ్చే నెల న ఏ.కోడూరు, చిన్నదేవలాపురం, 2న బి.కోడూరు, నారాయణపురం, 3న జి.లింగాపురం, భోజనం, 4న పరమటూరు జీసీ పాలెం గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొండచరియను ఢీకొన్న కారు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో ఓ కారు కొండచరియను ఢీకొంది. అనంతపురం జిల్లాకు చెందిన కొందరు గిద్దలూరు మీదుగా శ్రీశైలం వెళ్తుండగా పురాతన వంతెన వద్ద ఉన్న మలుపు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు కొండ చరియను ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డీఎస్సీ పరీక్షల హాల్ టికెట్లు విడుదల

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ– 2025 పరీక్షలను జూలై 1, 2 తేదీలకు ప్రభుత్వం మార్పు చేసింది. ఆయా తేదీల్లో పరీక్ష రాయాల్సిన అభ్యర్థులకు సంబంధించి మార్పు చేసిన పరీక్ష కేంద్రాలు, పరీక్ష తేదీల హాల్‌టికెట్లు మెగా డీఎస్సీ httpr://apdrc.apcfrr.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ కొత్త హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని ఒకటికి రెండుసార్లు పరీక్ష కేంద్రాలు సరి చూసుకొని నిర్ధారించుకోవాలన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హరిగోపాల్ ఆదేశించారు. కృష్ణాపురం గ్రామంలోని లేఅవుట్‌లో నిర్మితమవుతున్న గృహాలను బుధవారం ఆయన పరిశీలించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం త్వరలో అందుతుందన్నారు. డీఈ నాగరాజు, ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయక్ పాల్గొన్నారు.

జీఎస్టీ ఆదాయం పెంచాలి

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో జీఎస్టీ ఆదాయాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కమర్షియల్ ట్యాక్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జీఎస్టీ ఆదాయం పెంపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక వనరులను అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సుమారుగా 12,033 మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు. జిల్లాలో ఏదైనా నూతన సంస్థ ఏర్పాటు చేస్తుంటే అందుకు తగిన సమాచారం అందజేయాలన్నారు. అలాగే జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని అందులో ఉన్న సిబ్బంది ప్రొఫెషనల్ టాక్స్‌లోకి వచ్చారా లేదా అనేది చూడాలన్నారు. ముఖ్యంగా వస్తువుల(గూడ్స్)కు సంబంధించి రూ.40 లక్షలు, కాంట్రాక్ట్ సర్వీసులకు సంబంధించి రూ.20 లక్షలు దాటిన వారి వివరాలు తెలపాలన్నారు. జిల్లాలో మైనింగ్ లీజు దారుల నుంచి జీఎస్టీ పన్ను వసూలయ్యేలా చూడాలన్నారు. ప్రతి నెల 10వ తేదిలోపు జీఎస్టీ 7ఆర్‌ను ఫైల్ చేయాలని, లేకపోతే ప్రతి రోజు రూ.100 చొప్పున సంబంధిత డీడీఓ నుంచి వసూలు చేయడం జరుగుతోందన్నారు. అంతకుముందు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్‌రావు, డిప్యూటీ కమిషనర్ పి.సురేష్‌లు వాణిజ్య పన్నుల శాఖ విధి, విధానాలు, జీఎస్టీ నిర్వహణ, జీఎస్టీ ట్యాక్సేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నంద్యాల వాణిజ్య పన్నుల శాఖ 1, 2 సహాయ కమిషనర్లు లక్ష్మీనాయక్, సుజిత, ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, అరుణజ్యోతి, జిల్లా ఖజానా అధికారి లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌డీఎంలు పాల్గొన్నారు.

బ్యాంక్‌కు వెళ్లొచ్చేలోపు ఇంట్లో చోరీ

మహానంది: ఉపాధి కూలీ వేతనాలు ఖాతలో జమ అయ్యాయో లేదో చూసుకుందామని బ్యాంకుకు వెళ్లొచ్చే లోపే బుధవారం తమ్మడపల్లె గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు కాసుల పెద్ద వెంకటరమణ దంపతులు తెలిపిన వివరాలు.. పెద్ద వెంకటరమణ దంపతులు ఉపాధి కూలీ పనులతో పాటు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి కూలీ డబ్బులు ఖాతాలో వేశారే మోనని బుక్కాపురం బ్యాంకుకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దుస్తులను చెల్లాచెదురు చేసి, రూ.16 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. ఈ విషయంపై మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బరకాల కాలనీలో..

బండ ఆత్మకూరు: మండల పరిధిలోని నారాయణపురం బరకల కాలనీలో చోరీ జరిగింది. బుధవారం ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన కందుకూరి లీలావతి తమ పిల్లలను హాస్టల్‌లో చేర్పించడానికి ఈనెల 22న గిద్దలూరు వెళ్లింది. తిరిగి వచ్చేలోపే ఇంటి తలుపు పగలగొట్టి బీరువాలో ఉన్న 4.0 తులాల బంగారం నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయ భూములకు బహిరంగ వేలం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన ఆలయ భూములకు బుధవారం కౌలుకు బహిరంగ వేలం నిర్వహించామని గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణ అధికారి ఈ.నాగప్రసాద్ బుధవారం తెలిపారు. వరదరాజ, లింగమయ్య స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 40.36 ఎకరాల భూమికి కౌలుకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.12.83 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కాగా గత ఏడాది ఇదే భూములకు రూ.17.29 లక్షలు వచ్చిందన్నారు. కార్యక్రమానికి కోవెలకుంట్ల గ్రూపు దేవస్థానం ఈఓ టి.బాల చెంచన్న పాల్గొన్నారు.

ఎదురుపాడును సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో ఉన్న వీధిరోడ్ల దుస్థితిపై ఈనెల 24న సాక్షి దినపత్రిలో ×అడుగేస్తే చిత్తడే¤ శీర్షికన వెలువడిన కథానికి అధికారులు స్పందించారు. బుధవారం ఈఓఆర్డీ పార్థసారథి పంచాయతీ కార్యదర్శి నాగరాజుతో కలసి గ్రామాన్ని సందర్శించారు. మురుగు నీరు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీలోని ఇంటింటికి వెళ్లి ఇళ్ల నుంచి నీరు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వృథానీటి కోసం ఇంటి ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్ల మీదకు వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీరు సరఫరా చేయాలి


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ ప్రజలు

నందికొట్కూరు: పట్టణంలోని బైరెడ్డి నగర్‌లో మండల పరిషత్ స్కూల్ చుట్టూ ఉన్న కుటుంబాలు, కాలనీ ప్రజలు తాగునీరు సరఫరా చేయాలని కోరుతూ బుధవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పది రోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుధవారం రోజు సరఫరా అవుతాయని పనులు వదులుకొని ఇంటి వద్దే వేచి ఉన్నా చుక్క నీరు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ నీటి సమస్య పరిష్కరించాలని వారు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు.

మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోండి

- డీఏఓ మురళీక్రిష్ణ


మాట్లాడుతున్న డీఏఓ మురళీక్రిష్ణ

పాములపాడు: మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం చెలిమిల్ల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మట్టి పరీక్షా ఫలితాలను బట్టి ఎరువులు, మందులు వాడాలన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. ప్రతి కౌలు రైతు కౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయ, సర్పంచు కోట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

- **జూపాడుబంగ్లా:** ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత తలెత్తనివ్వమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. తరిగోపుల గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఓ బి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.
- **నందికొట్కూరు:** మండల పరిధిలోని బిజినవేముల గ్రామ పొలిమేరలో రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ జయశేఖర్‌తో పాటు ప్రకృతి వ్యవసాయ, ఆబీకే సిబ్బంది పాల్గొన్నారు.
- **కొత్తపల్లి:** మండల పరిధిలోని గోకవరం, ఎదురుపాడు గ్రామాల పొలాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అమీరున్నీస బేగం మాట్లాడుతూ ప్రతి రైతు పంటమార్పిడి పద్ధతి పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.
- **వెలుగోడు:** వెలుగోడు, బోయరేవుల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ స్వాతి మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.
- **బండి ఆత్మకూరు:** పార్నపల్లి, సింగవరం గ్రామాల్లో ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని ఆయన రైతులకు సూచించారు.
- **మహానంది:** గాజులపల్లె, బసవాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించారు. ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ అరటి రైతులు జూలై 15 లోపు పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు.
- **ఆత్మకూరు:** మంలంలోని వడ్ల రామాపురం, శ్రీపతిరావుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ హేమలత మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంచుకోవాలన్నారు.


అడవి పందులతో పైర్లకు నష్టం

మహానంది: అడవి పందులతో పైర్లకు నష్టం కలుగుతోందని బసవాపురం గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సుబ్బరాయుడు, మద్దిలేటి తదితరులు సుమారు మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మంగళవారం రాత్రి అడవి పందులు పొలాల్లోకి ప్రవేశించి నాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అడవి పందుల బారి నుంచి పైర్లను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: చుక్కల భూములు, పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం మిడుతూరు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో రైతుల సమస్యలపై తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు వెంకటస్వామి, శ్రీనివాసులు, సంజమ్మ తదితరులు ఉన్నారు.


మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం


గువ్వలకుంట్లలో వర్షం పడుతున్న దృశ్యం

వర్షం.. హర్షం


కొత్తపల్లిలో వర్షపునీటిలోనే వెళ్తున్న వాహనదారుడు

ఆత్మకూరు, మహానంది, కొత్తపల్లి మండలాల్లో బుధవారం వర్షం దంచి కొట్టింది. ఆత్మకూరులో 4.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. మహానంది ఆలయ పరిసరాల్లో ఓ వైపు ఎండ కాస్తుండగా .. మరో వైపు వర్షం కురవడంతో భక్తులు వింతగా చూశారు. ఆషాడ మాసం ప్రారంభం కావడంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. వచ్చిన కొద్దిపాటి భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను దర్శించారు. కొత్తపల్లి మండలంలోని బండినాయునిపాలెం, గువ్వలకుంట్ల, జి.వీరాపురం, బవాపురం, నందికుంట, దుద్యాల, కొక్కెరంచ, ఎదురుపాడు, గోకవరం గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆత్మకూరు–సంగమేశ్వరం ప్రధాన రహదారిలో నందికుంట, బావాపురం గ్రామాల్లో రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. డ్రైనేజీలు లేకపోవడంతో జి.వీరాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. కొత్తపల్లి బస్టాండ్ నుంచి బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి మొత్తం వర్షపు నీటితోనే నిండి చెరువును తలపించింది. వాహదారులు నీటిలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా ఈ వర్షం పైర్లకు జీవం పోస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

– మహానంది/కొత్తపల్లి/ఆత్మకూరు


ఆటోలో తడుస్తూ ఆనందిస్తున్న చిన్నారులు


వీరాపురం గ్రామంలో వర్షపునీటితో కుంటను తలపిస్తున్న రోడ్డు